క్లుప్తంగా

మైనారిటీ విద్యార్థులకు అండగా ప్రభుత్వం



అభ్యర్థులకు గ్రూప్‌-2 స్టడీ మెటీరియల్ అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షులు

ఎమ్మిగనూరుటౌన్: మైనారిటీ విద్యార్థుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌ఎంకే కోచింగ్ సెంటర్‌లో ఏపీ మైనారిటీ వెల్ఫేర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ అభ్యర్థులకు ఏపీపీఎస్సీ గ్రూప్‌–2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కోచింగ్ సెంటర్‌లో గ్రూప్‌–2 స్టడీ మెటీరియల్‌ను జిల్లా వక్ఫ్‌బోర్డ్ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రుక్మాన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ అభ్యర్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని కష్టపడి చదివితే ఉద్యోగ సాధన సులువేనన్నారు. నిర్వాహకులు ఆశాలుక్మాన్, పలువురు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శేషవాహనంపై చెన్నకేశవ స్వామి



స్వామివారికి శేషవాహన సేవ నిర్వహిస్తున్న ఆలయ ఈఓ, భక్తులు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో వెలసిన శ్రీలక్ష్మి కౌలుట్ల చెన్నకేశవ స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం స్వామివారికి శేషవాహన సేవ చేపట్టారు. స్వామి, అమ్మవార్లను శేషవాహనంపై ఉంచి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ చైర్మన్ ఆర్.హనుమంతరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి భక్తుల సమక్షంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

హాకీ క్లబ్ ప్రారంభం

పత్తికొండ రూరల్: పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గురువారం హాకీ క్రీడా క్లబ్‌ను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ వీరేశప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కర్నూలు జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దాసరి సుధీర్ ముఖ్యఅతిథిగా హాజరై క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాకీ నేర్చుకోవడంతో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా పొందే అవకాశం ఉందన్నారు. సమ్మర్ క్యాంపు కూడా త్వరలో ప్రారంభమవుతుందని చెప్పారు. అధ్యాపకులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్లబ్ కమిటీ ఎన్నిక

క్లబ్ అధ్యక్షుడుగా కె.విజయరావు, కార్యదర్శిగా జి.సునీల్ కుమార్, కోశాధికారిగా సుజిత్ కుమార్, సభ్యులుగా రమేష్‌బాబు, రజియాభాను, రహిమాన్, స్వప్నలను ఎన్నుకున్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో గురువారం ఉదయం 7 గంటలకు సీతారామసహిత లక్ష్మణ, హనుమ, మహాలక్ష్మి, సుగాలి నాగమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే ఆలయం ముందు ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోలుకోలేక యువకుడి మృతి



కుమ్మరి విజయ్ (ఫైల్)

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామానికి చెందిన కుమ్మరి విజయ్ (24) చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఈ నెల 16న ఎమ్మిగనూరు పట్టణంలోని 167 జాతీయ రహదారిపై కమిటీ రోడ్డులో రాంగ్ రూట్‌లో వస్తున్న బొలెరో వాహనం విజయ్ బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన విజయ్‌ను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక గురువారం విజయ్ మృత్యువాత పడ్డాడు. తండ్రి కుమ్మరి నాగన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

ఇద్దరు చిన్నారులకు డెంగ్యూ

దేవనకొండ: మండలంలోని కుంకనూరు గ్రామం ఎస్సీ కాలనీలోని నాలుగేళ్ల వయస్సున్న ఇద్దరు చిన్నారులకు డెంగ్యూ నిర్ధారణ కావడంతో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొన్ని రోజులుగా పిల్లలకు తీవ్ర జ్వరం రావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోని ఆస్పత్రికి తీసుకెళ్లామని, అక్కడ వైద్యులు పరీక్షించి డెంగ్యూ జ్వరమని చెప్పారన్నారు. సంబంధిత అధికారులు గ్రామంలో నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సంక్షేమ రథ సారథులు వలంటీర్లు



వెల్దుర్తిలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



ఎమ్మిగనూరులో పురస్కారాలందుకున్న వలంటీర్లతో సమన్వయకర్త బుట్టా రేణుక

వెల్దుర్తి(కృష్ణగిరి): పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడంలో వలంటీర్లు చేస్తున్న సేవ ఎంతో గొప్పదని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. గురువారం వెల్దుర్తి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ శివశంకరప్ప ఆధ్వర్యంలో మండలంలోని వలంటీర్లకు సేవా రత్న, సేవామిత్ర పురస్కారాలను ఆమె అందించారు. ప్రశంసాపత్రాన్ని ఇచ్చి, శాలువా కప్పి సత్కరించారు. సేవారత్నగా పురస్కారం పొందిన వెల్దుర్తి సాయిప్రసన్న, రామళ్లకోట మాలిక్‌బాష, నర్సాపురం మహేశ్వరి, మల్లెపల్లె అనూష, గోవర్ధనగిరి రామకృష్ణ, సేవా మిత్రలుగా ఎంపికైన 305 మంది వలంటీర్లను అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వలంటీర్ల సేవల వల్ల ప్రభుత్వానికి వచ్చిన మంచిపేరు చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఏపీ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. జెడ్పీటీసీ సభ్యుడు సుంకన్న, మల్లెపల్లె సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. వలంటీర్లు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ తమకు కల్పించని సేవ చేసే అవకాశానికి కృతజ్ఞతలు తెలిపారు. తాము చేస్తున్న సేవలో పేదల ఆశీర్వాదాలు పొందుతున్నట్లు అనుభూతులను పంచుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వలంటీర్లందరితో సెల్ఫీ తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, సర్పంచ్ ముత్యాల శైలజ, సీడీపీఓ ల్యూక్, ఈఓఆర్డీ నరసింహులు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొత్తూరు వెంకటేశ్వరరెడ్డి, వెంకట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

పదో తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. ఆమె గురువారం తన స్వగ్రామం చెరుకులపాడు జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులపై ఆరా తీస్తూ ఉపాధ్యాయులతో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించి భయం వీడి పరీక్షలకు సన్నద్ధం కావాలని ధైర్యం నింపారు. ఉన్నత చదువులు చదివి ఎదగాలని అభిలషించారు.

ఎమ్మిగనూరుటౌన్: అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక పేర్కొన్నారు. పట్టణంలోని కుర్ణి కల్యాణ మండపంలో గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అధ్యక్షతన వలంటీర్లకు పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. వలంటీర్లకు శాలువాలు కప్పి, ప్రశంసాపత్రాలను బుట్టా రేణుక, చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, కుర్ణి కరికల రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదమ్మతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లు ప్రజల గుండెల్లో స్థానం పొందారన్నారు. వలంటీర్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు అందించిన సేవలను ఎవరు మరువలేరన్నారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన పథకాలను లబ్ధిదారులకు చేరవేయడం, లబ్ధిదారుల ఎంపికలో సంక్షేమ వారధులుగా పనిచేసి ప్రతి కుటుంబానికి సొంతమనుషుల్లా చేరువై వారి కష్టసుఖాల్లో భాగస్వాములుగా వలంటీర్లు నిలిచారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నాయని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, మున్సిపల్ కౌన్సిలర్లు అమాన్, బజారి, కోటకొండ నరసింహులు, కామర్తి నాగేషప్ప, అంపమ్మ, పూజేశ్వరి, సంధ్య, రామాంజినమ్మ, డిష్ కేశవరెడ్డి, సుధాకర్, గట్టుభాజ తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు: ప్రజల కోసం నిస్వార్థంగా వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.విరూపాక్షి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ ఆంతోనీ, ఎంపీపీ నెట్టికంటమ్మ, వైస్ ఎంపీపీ నాగేష్, మండల కన్వీనర్ రామారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విరూపాక్షి మాట్లాడుతూ.. మండలంలో బిలేహాల్ నుంచి గొల్ల గాదిలింగప్ప, కామినహాల్ నుంచి అబ్దుల్‌రహీమ్‌కు సేవావజ్ర పురస్కారాలు దక్కడం అభినందనీయమన్నారు.. అలాగే ఐదుగురికి సేవా రత్న, 167 మందికి సేవామిత్ర పురస్కారాలు లభించాయన్నారు. అనంతరం వలంటీర్లకు శాలువాలు కప్పి ప్రశంసా పత్రాలతో సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున, శ్రీనివాసులు, రంజిత్, మారయ్య, రామకృష్ణ, తిమ్మప్ప, గోపాల్‌శెట్టి, కృష్ణ నారాయణ, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.



హాలహర్వీలో వలంటీర్లను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు

- స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రంగమ్మ ఆధ్వర్యంలో గురువారం వలంటీర్లకు సేవా అవార్డులను అందజేశారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి పాల్గొని వారికి శాలువా కప్పి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. సేవా వజ్రకు ఎంపికైన సురేష్, సేవారత్నకు ఎంపికైన బి.నాగవేణి, ఉస్మాన్‌ఘణి, పూల హరీష్‌లను ప్రత్యేకంగా అభినందించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్, వైస్ ఎంపీపీ శ్రీరాములు, నాగవేణి, బాషా, మారయ్య, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



వలంటీర్‌గా నాకు కేటాయించిన ఏరియాలో ప్రజల్లో మమేకమై సేవలందించా. ప్రజల సమస్యలు తెలుసుకుని ఎప్పటికప్పుడే పరిష్కారించేందుకు కృషి చేశాను. జగనన్న ఆశయం నెరవేర్చేలా పని చేశాను. ఇంత గొప్ప వ్యవస్థలో సేవలందించినందుకు చాలా సంతోషంగా ఉంది.

– జి.గాదిలింగప్ప, గ్రామ వలంటీర్, బిలేహాల్

జగనన్నకు కృతజ్ఞతలు



వలంటీర్‌గా నాకు కేటాయించిన 50 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి లబ్ధిదారులకు సకాలంలో అందించేవాడిని. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యం చేసేందుకు కృషి చేశా. ప్రజల నుంచి వచ్చే స్పందన ఎంతో సంతృప్తినిస్తోంది. ఇలాంటి అవకాశం కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటా.

– అబ్దుల్‌రహీమ్, గ్రామ వలంటీర్, కామినహాల్

సచివాలయ వ్యవస్థతో సేవలు సులభతరం



మసీదుపురంలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సమన్వయకర్త బుట్టా రేణుక

ఎమ్మిగనూరురూరల్: సచివాలయ వ్యవస్థ అమలుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ సేవలను సులభతరం చేశారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, హెల్త్ క్లినిక్ కేంద్రాలను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ సేవల కోసం కార్యాలయల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేదని, నేడు ఆ పరిస్థితి మారిందన్నారు. సమస్యను సచివాలయంలో తెలియచేస్తే అధికారులే పరిష్కారం చూపుతారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని ఆదరించి భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు. సమన్వయకర్త బుట్టా రేణుక మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్నాడని చెప్పారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ నాగమ్మ, నాయకులు జయమ్మ, తిప్పన్న, రాముడు, హనుమప్పనాయుడు, రామాంజనేయులు, హనుమంతు, నరసింహులు, ఈశ్వరప్ప, ఓంకారప్ప, శివలింగ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ : మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో వారం రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు హనుమప్పనాయుడి ఇంటికి గురువారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి వెళ్లి పరామర్శించారు. హనుమప్పనాయుడి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, త్వరగా కోలుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని అడ్డుకోలేరు

- నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటాం
- కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య



వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, జేసీఎస్ కో–ఆర్డినేటర్ సురేందర్ రెడ్డి, సమన్వయకర్త విరూపాక్షిని సత్కరిస్తున్న దృశ్యం

ఆలూరు: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఎవరూ అడ్డుకోలేరని పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ సురేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి ఆధ్వర్యంలో ఆరు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పార్టీకి అఖండ విజయం అందించేలా కృషి చేయాలన్నారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించి సీఎం జగనన్నను ఆదరించేలా ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఒత్తిళ్లు ఎదురైతే అండగా ఉంటామని భరోసాఇచ్చారు. ఈ నెల 18న అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన సిద్ధం సభను విజయవంతం చేసిన వారందరికీ బీవై రామయ్య కృతజ్ఞతలు తెలిపారు. సమన్వయకర్త విరూపాక్షి, జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ సురేందర్ రెడ్డి మాట్లాడారు. సమావేశంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు రంగమ్మ, దొరబాబు, హేమలత, ఉమాదేవి, ఏరూరుశేఖర్, నాయకులు ఈరన్న, మారయ్య, పెద్దయ్య, సర్పంచ్‌లు దేవిరెడ్డి, వెంకటరెడ్డి, ప్రహ్లాద్‌రెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేటి నుంచి లాలుస్వామి ఉరుసు

కృష్ణగిరి: కొలిచే వారికి కొంగు బంగారమై, ఆపదలో అదుకునే మహిమానిత్యుడు లాలుస్వామి. చిట్యాల గ్రామంలో వెలసిన భక్తుల ఆరాధ్య దైవం లాలుస్వామి ఉరుసును శుక్రవారం నుంచి మూడు రోజులు జరుపుకుంటున్నట్లు దర్గా ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు.

మూడు రోజులు పాటు కార్యక్రమాలు...

ఉరుసు సందర్భంగా గ్రామంలో మూడు రోజులు పాటు పండుగ వాతావరణం ఉంటుంది. శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు దాతల సహాయంతో వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందించనున్నారు. ఇదే రోజు రాత్రి 11 గంటల నుంచి గంధం సమర్పిస్తారు. 24న అత్యంత భక్తిశ్రద్ధలతో ఉరుసు నిర్వహించి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. 25న కిస్తీతో ఉరుసు ముగుస్తుంది.

వృషభాల బండలాగుడు పోటీలో

ఉరుసు సందర్భంగా 25న రాష్ట్రస్థాయి పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. గెలుపొందిన వృషభాల యజమానులకు కమిటీ తరపున దాతల సహకారంతో వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలను అందజేయనున్నారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 99890 28249, 94406 37027 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు. గ్రామానికి చెందిన శ్రీనివాసమూర్తి, హరిప్రియ దంపతుల సహకారంతో మూడు రోజులపాటు భక్తులకు అన్నదానం చేయనున్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డాక్టర్ శైలేష్‌కుమార్

దేవనకొండ: మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్, వైద్యాధికారి విజయభాస్కర్ సూచించారు. ఈ మేరకు గురువారం పల్స్ పోలియో కార్యక్రమంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆరోగ్య అధికారులు, ఆశా కార్యకర్తలకు, అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం చేపట్టారు. డాక్టర్ శైలేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఐదేళ్ల వయస్సులోపు పిల్లలందరికీ పోలియో చుక్కలను తప్పక వేయించాలన్నారు. ప్రయాణంలో ఉన్న వారి పిల్లలకు బస్టాండ్లలో, ఇటుక బట్టీలలో పనిచేసే వారి పిల్లలకు, సంచార జాతులవారి పిల్లలకు, రోడ్డు పనులు చేస్తున్న వారి పిల్లలు, పొలాలు, భవన నిర్మాణాలు జరిగే చోట, క్వారీలలో పనిచేసే వారి పిల్లలను గుర్తించి ప్రతిఒక్కరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. ఆ రోజున వేయించుకోని వారికి మార్చి 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కళ్యాణ్, చంద్రశేఖర్, రఘురామిరెడ్డి, సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దేవతామూర్తుల ప్రతిష్టాపన



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, సమన్వయకర్త బుట్టా రేణుక

నందవరం: మండలంలోని ముగతి గ్రామంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన వేడుక కనులపండువగా జరిగింది. పవిత్ర మాఘమాసాన్ని పురస్కరించుకుని గురువారం నూతన ఆలయ ప్రారంభం చేపట్టారు. అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య వినాయక, కుమారస్వామి, శివలింగం, సీతారామాంజనేయులు, ధ్వజస్తంభ ప్రతిష్టాపన గావించారు. బెల్డోణ రామనాథ శాస్త్రి ఆధ్వర్యంలో వేడుక కానిచ్చారు. వేడుకల్లో భాగంగా విగ్రహాల గ్రామోత్సవం, గణపతి, గంగపూజ ఆకట్టుకున్నాయి. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త బుట్టారేణుక, సర్పంచు విరుపాక్షిరెడ్డి వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు రాతనకు ఎమ్మెల్యే రాక

తుగ్గలి: మండల పరిధిలోని రాతన గ్రామానికి శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ, సచివాలయ మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్, హనుమంతు తెలిపారు. గ్రామంలో రూ.5 కోట్లతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, ఆర్‌బీకె, హెల్త్ సెంటర్లతో పాటు ఆర్.కొత్తూరు వరకు వేసిన బీటీ రోడ్డు, సీసీ రోడ్డును ఆమె ప్రారంభిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ బొమ్మన సరళా రవిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. కోరంకు అవసరమైన ఎంపీటీసీలు హాజరుకాగా మండలంలోని వివిధ శాఖల అధికారులు కర్నూలులో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమావేశానికి వెళ్లిపోవడంతో ప్రభుత్వ పథకాలు, సమస్యలు పరిష్కరించేవారు లేక సమావేశం ముగించేశారు. ఎంపీడీఓ శివశంకరప్ప, జెడ్పీటీసీ సుంకన్న, ఎంపీటీసీ బొమ్మన రవిరెడ్డి, పలువురు అధికారులు హాజరై ముగిసిందనిపించారు. సమావేశం ముగిసిందన్నది తెలియక ఆలస్యంగా వచ్చిన పలువురు సర్పంచ్‌లు తమ గ్రామ సమస్యలను ఎంపీడీఓకు విన్నవించి వెళ్లిపోయారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

మద్దికెర: మద్దికెరలోని పోలింగ్ బూత్‌లను ఆర్‌ఐ రవికుమార్, వీఆర్‌ఓ రంగస్వామి పరిశీలించారు. వారు గురువారం స్థానిక ఆదిఆంధ్ర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బూత్‌లలో ఓటర్లు ఇబ్బందులు పడకుండా మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఏఏ ప్రాంతాల ఓటర్లు బూత్‌లకు వస్తారో వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

కబడ్డీ విజేత మిద్దెపల్లె జట్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో దస్తగిరయ్య స్వామి ఉరుసు సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో డోన్ మండలం మిద్దెపల్లె జట్టు విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్ పోటీల్లో మిద్దెపల్లె, చిట్యాల జట్లు మొదటి, రెండవ స్థానాలు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో 45 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు దాతలు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, చాకలి నాగేశ్వరరావు, మహబూబ్‌బాషా, శేఖర్ సహకారంతో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే తరపున వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు వరుసగా రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలను అందజేశారు.

వాహనాల వేలంలో రూ. 10 లక్షల ఆదాయం

ఎమ్మిగనూరురూరల్: స్థానిక సెబ్ సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మోటార్ బైకులు, కార్లను గురువారం సాయంత్రం వేలం వేయగా ప్రభుత్వానికి రూ.10.08 లక్షలు ఆదాయం వచ్చింది. గురువారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరిండెంట్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 5 బైకులు, కార్లు, ఫార్వినర్ వాహనాలను వేలం వేసినట్లు చెప్పారు. జీఎస్టీతో కలిపి రూ.10,08,310 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. సెబ్ ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా కాశిరెడ్డి నాయన ఆరాధన



పూజలందుకుంటున్న కాశిరెడ్డి నాయన

వెల్దుర్తి(కృష్ణగిరి): శ్రీరంగాపురం కొండల్లో ఏర్పాటైన నిత్యాన్నదాన క్షేత్రం కాశిరెడ్డినాయన ఆశ్రమంలో అవధూత కాశిరెడ్డినాయన, సమీప కోటపేట అంజనేయస్వామి వార్ల 14వ ఆరాధన ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. నిర్వాహకులు రామచంద్రారెడ్డి, శ్రీరంగాపురం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉత్సవాలు ఉదయం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. వెల్దుర్తి, బేతంచెర్ల, డోన్, ప్యాపిలి, పత్తికొండ, కర్నూలు మండలాల నుంచి విచ్చేసిన భక్తులతో ఆశ్రమం కిక్కిరిసింది. కాశిరెడ్డినాయనకు పల్లకీసేవ, ఊరేగింపు, అనంతరం కోటపేట ఆంజనేయస్వామితో పాటు ఆశ్రమం పక్కనే వెలసిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి, లక్ష్మీ నరసింహస్వామి వార్ల ఏడవ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వార్లకు, నాగప్రతిమలు, నవగ్రహాలకు, సమీప వైష్ణవ క్షేత్రంలోని పాలుట్ల రంగస్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆశ్రమ ప్రాంతంలో నందికోల సేవ, జ్యోతి జ్వాల కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. రాత్రి కోలాటం సూదేపల్లె బృందం వారిచే నిర్వహించిన కట్టి కోలన్న, డీసీ కృష్ణ, రోశిరెడ్డిలచే ప్రదర్శింపబడిన పంచమాంకములు ఉచిత నాటక ప్రదర్శన భక్తులను అలరించాయి.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఆరాధనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన న్యూకేటగిరీ వృషభాల బండలాగుడు పోటీల్లో 13 జతల వృషభాలు పాల్గొనగా హోరాహోరీ పోరులో అనంతపురం జిల్లా ఓబులదేవర పల్లె బెస్త శ్రీరాములు వృషభాలు విజేతలుగా నిలిచి రూ.40 వేల నగదు బహుమతిని గెలుచుకున్నాయి. శ్రీరంగాపురం వైఎస్సార్‌సీపీ నాయకుడు మూలింటి జయన్న ప్రారంభించిన పోటీలలో తర్వాతి 2 ,3 స్థానాలలో పాణ్యం ఎస్.కొత్తూరు బీరం బుల్స్ నిలిచి రూ.30 వేలు, రూ.20 వేలు గెలుచుకోగా, 4, 5, 6 స్థానాలలో వరుసగా పగిడ్యాల కొడెల గిరిజ వృషభాలు, అనంతపురం జిల్లా జీరం బ్రదర్స్ అండ్ జీఎంఆర్ బుల్స్, అనంతపురం రామాంజనేయులు అండ్ ఈశ్వరప్రసాద్ వృషభాలు నిలిచి రూ.11 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు గెలుచుకున్నాయి. గుండు ఎత్తే పందెంలో ఉలిందకొండ మనోహర్ ప్రథమ స్థానం 4 తులాల వెండి పతకం, మాధవరం రాజశేఖర్ ద్వితీయ స్థానం 2 తులాల వెండి పతకం సాధించాడు. ఆశ్రమ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, శ్రీరంగాపురం నాయకులు విజేతలకు బహుమతులందించారు. నాయకులు సుంకిరెడ్డి, వెంకటేశ్, సీటీ గోపాల్, నాగరాజు, ఎర్రమల, సుధాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో గురువారం సాయంత్రం 60.40 గంటలకు లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దేవాలయంలో ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం హనుమప్పనాయుడు ఇంటి నుంచి స్వామివారికి నైవేద్యంను పూర్ణకుంభంతో తీసుకొచ్చారు. పూజరి ఈరన్న నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి రథోత్సవం భక్తుల హర్షధ్వానాల మధ్య ముందుకు సాగింది. వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామిని ఉదయం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి దర్శించుకోగా, సాయంత్రం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బుట్టా రేణుక, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, ఎంపీపీ గొల్ల కేశన్న దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. రూరల్ ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గ్రామంలో చెన్నకేశవ స్వామి ఆలయ నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి రూ.50 వేలు విరాళం అదించారు. గురువారం ఆయన అరికెర గ్రామంలో ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఈరన్న, నాయకులు వెంకటేష్, వీరేష్, రామాంజినేయులు తదితరులు ఉన్నారు.

హొళగుందకు చేరిన ఎల్లెల్సీ నీరు

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు విడుదల చేసిన నీరు గురువారం ఆంధ్ర పరిధిలోని 180 కి.మీ హొళగుంద సెక్షన్‌ను దాటి ముందుకెళ్లాయి. తాగునీటి అవసరాల నిమిత్తం ఈ నెల 19 నుంచి ఏపీ కోటా నీటిని అధికారులు విడుదల చేశారు. నీటి విడుదలను మార్చి 10వ తేదీ వరకు రోజు 480 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు టీబీ బోర్డు అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 9.106 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో జీరో ఉండగా అవుట్‌ఫ్లో 507 క్యూసెక్కులుంది. గతేడాది ఈ సమయానికి డ్యాంలో 34 టీఎంసీల నీరు నిల్వ ఉండేది.